# ఫాక్స్‌సాగర్.. ఎఫ్‌టీఎల్‌లో
# అక్రమ నిర్మాణాలు

- బఫర్ జోన్‌లోని కట్టడాల కూల్చివేతలు
- తహసీల్దార్ సంజీవరావు, అధికారులపై తిరగబడ్డ కబ్జాదారులు
- తీవ్ర ఉద్రిక్తల మధ్య కూల్చివేతలు



ఓ పరిశ్రమ ప్రహరీని జేసీబీతో కూల్చివేయిస్తున్న సిబ్బంది

**జీడిమెట్ల:** ఫాక్స్‌సాగర్‌లోని ఎఫ్‌టీఎల్ జాగాలో వెలిసిన అక్రమ కట్టడాలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తీవ్ర ఉద్రిక్తతల నడుమ కూల్చివేశారు. ఇటీవల ఫాక్స్‌సాగర్ చుట్టూ అధికారులు అభివృద్ధి పేరుతో ట్రాక్ కోసం రోడ్డును ఏర్పాటు చేశారు. ఫాక్స్ సాగర్ బఫర్ జోన్ జాగా రోడ్డు అవతలివైపు వెళ్లడంతో సదరు స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. ఇక అంతే సంగతులు కొంతమంది భూకబ్జాదారులు సదరు జాగాకు సర్వే నంబర్లతో పేపర్లు తయారు చేయించుకున్నారు. ఒక్కొక్కటిగా షెడ్లను నిర్మిస్తూ వస్తున్నారు. ఈ విషయమై కుత్బుల్లాపూర్ తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులకు పలువురు ఫిర్యాదులు చేశారు. ఈ విషయంలో అధికారులపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో సోమవారం అధికారులు జేసీబీలతో పలు కట్టడాలను కూల్చివేశారు.

**రెవెన్యూ అధికారులపై దాడికి ప్రయత్నించిన పలువురు..**

సదరు జాగాలో వివిధ సర్వే నంబర్లతో జాగాను అక్రమించుకున్న కొంతమంది వద్ద పేపర్‌లు ఉన్నాయి. దీంతో వారం రోజులుగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సదరు స్థలాలపై సర్వే నిర్వహించగా సదరు స్థలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ స్థలాలని తేలింది. దీంతో సోమవారం కుత్బుల్లాపూర్ తహసీల్దారు సంజీవరావు, ఆర్ఐ రేణుక, ఇరిగేషన్ ఏఈ రామారావులు ఫాక్స్ సాగర్ బఫర్‌జోన్ స్థలాల వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ప్రహరీ నిర్మించిన కొన్ని కట్టడాలను కూల్చివేశారు. కూల్చివేతల సమయంలో కొంతమంది అధికారులపై దాడికి దిగడంతో స్థానికులు వారిని వారించి అడ్డుకున్నారు. దీంతో అధికారులు కొంతమేర స్థలాలను కూల్చివేసి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

**కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలి..**

వారంరోజుల క్రితం తూతూమంత్రంగా అధికారులు కూల్చివేతలు చేయడంతో సదరు ప్రభుత్వ స్థలాలను అక్రమించడంలో రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారని స్థానికులు ఆరోపించారు. దీంతో సోమవారం అధికారులు సదరు స్థలాల్లో వెలసిన కట్టడాలను నేలమట్టం చేశారు. అయినప్పటికీ కబ్జాదారులపై రెవెన్యూ అధికారులు క్రిమినల్ కేసులు పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



తహసీల్దార్ సంజీవరావుతో వాగ్వాదం చేస్తున్న దృశ్యం



## మయూరమా.. వయ్యారమా!

రియల్ ఎస్టేట్ రంగం రోజు రోజుకు పుంజుకోవడంతో నగర శివార్లు నిర్మాణాలతో నిండి పోతున్నాయి. బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో అనేక వెంచర్లు ఉండేవి. దీంతో భౌరంపేట్ ఆటవీ ప్రాంతం అనుకుని ఉండటంతో ఇక్కడ నెమళ్లు ఎక్కువగా సంఖ్యలో ఉండేవి. ఉదయం సాయంత్రం వేళల్లో స్థానికులను ఆహ్లాదాన్ని కల్గించేవి. కాని నేడు వెంచర్లల్లో ఉన్న చెట్లు, దట్టమైన పొదలు నరికివేస్తుండటంతో నెమళ్లకు అవాసాలు లేకుండా పోయాయి. దీంతో బహిరంగ ప్రదేశాల్లోనే నెమళ్లు దర్శనమిస్తున్నాయి. – నిజాంపేట్



## క్లుప్తంగా

### జీహెచ్‌ఎంసీ ఆటో ఢీ.. యువతికి గాయాలు

**దుండిగల్:** ద్విచక్ర వాహనాన్ని వెనుక జీహెచ్‌ఎంసీ ఆటో ఢీకొట్టడంతో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దూలపల్లి గంగస్థాన్‌కు చెందిన మానస(21) సూరారం కాలనీ శివాలయం దేవాలయానికి వెళ్తోంది. అదే సమయంలో షాపూర్‌నగర్ నుంచి సూరారం వైపు వస్తున్న జీహెచ్‌ఎంసీ చెత్తను తరలించే ఆటో ముందు వెళ్తున్న యాక్టీవాను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మానసను స్థానికులు సూరారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ మైనర్ అని తెలిసింది. ఈ విషయంపై దుండిగల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

### స్థానిక యువకులతో గొడవకు దిగిన బిహార్ యువకులు

**సుభాష్‌నగర్:** మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడి వద్ద కత్తి దొరకడం స్థానికంగా కలకలం రేపింది. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి దూలపల్లిలోని ప్రధాన రహదారి పక్కన ఆదివారం రాత్రి మత్తులో ఉన్న ఇద్దరు యువకులు స్థానికంగా ఉన్న మరో ఇద్దరు యువకులతో గొడవకు దిగారు. దీంతో మాట పెరగడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ యువకులను ప్రశ్నించారు. వారు బిహార్ చెందిన వారని, వారి నుంచి ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారు ఉండే గది నుంచి మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బిహార్ యువకుల రివాల్వర్ గాల్లో కాల్చారని పుకాలు షికార్లు చేశాయి. రివాల్వర్ విషయమై పోలీసులను వివరణ అడగగా అలాంటిదేమీ లేదని పేర్కొన్నారు.

### రివైజ్డ్ ఓటర్ లిస్ట్‌ను అందుబాటులో ఉంచాలి

**రంగారెడ్డినగర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన రివైజ్డ్ ఓటర్ లిస్ట్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని బీఆర్‌ఎస్ నాయకుడు కె.జయరామ్ సోమవారం ఎన్నికల అధికారి మంగతాయారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఓటర్ల లిస్ట్‌లో అవకతవకలు ఉండటంతో తమ ఓటు ఏ ప్రాంతంలోని ఏ బూత్‌లో ఉందో తెలియక ఇబ్బందులు పడుతన్నామని అన్నారు. గతంలో ఓటింగ్ శాతం తగ్గడంలో ఇదే ప్రధాన కారణమని తెలిపారు. ఈసారైనా ఓటర్ లిస్ట్‌లో తప్పులను సరి చేసి ఓటర్లకు రివైజ్డ్ లిస్ట్‌ను అందుబాటులో ఉంచి ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని కోరారు. దీనిపై మంగతాయారు సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**కుత్బుల్లాపూర్:** అభివృద్ధికి దూరంగా ఉన్న సామాజిక వర్గాల అభ్యున్నతికి తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ (ఎస్‌టీపీఎఫ్) పని చేస్తుందని కోర్ కమిటీ సభ్యుడు, కో–కన్వీనర్ ఓరుగంటి వెంకటేశ్వర్లు అన్నారు. ఎస్‌టీపీఎఫ్ మేడ్చల్ జిల్లా సదస్సు నేపథ్యంలో సోమవారం కొంపల్లిలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మే 21న గుండ్లపోచంపల్లిలోని బీసీ కమ్యూనిటీహాలులో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

### కౌన్సిలర్లకు క్రీడాపోటీలు

**కుత్బుల్లాపూర్:** ముఖ్యమంత్రి కప్–2023లో భాగంగా కొంపల్లి మున్సిపల్ కౌన్సిల్, కో.ఆప్షన్ సభ్యులకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శ్రీహరి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 15 నుంచి 17 వరకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఔత్సాహిక కౌన్సిలర్లు ఓఎస్ శ్రీధర్‌ను సంప్రదించాలన్నారు.

### వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీకి సత్కారం



**కుత్బుల్లాపూర్:** వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నాన్ని సోమవారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అఖిల భారత వడ్డెర సంఘం నాయకులు సత్కరించారు. కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు సాతల గోపాల్, కార్యదర్శి గోగుల స్వామి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు హనుమంతు, రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు సంపంగి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల ఇంటింటి సర్వేకు శ్రీకారం



సమావేశంలో సూచనలు చేస్తున్న ఉపకమిషనర్ మంగతాయారు, హాజరైన బూత్ లెవెల్ అధికారులు

**కుత్బుల్లాపూర్:** నియోజకవర్గంలో ఓటర్ల ఇంటింటి సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 549 పోలింగ్ కేంద్రాల్లో 6,17,441 మంది ఓటర్లు నమోదు కాగా వీరిలో పురుషులు 3,24,910 మంది మహిళలు 2,92,406 మంది ఇతరులు 125 ఉన్నారు. అందుకు సంబంధించిన బూత్ లెవెల్ అధికారులతో సోమవారం అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంబంధిత పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ లిస్టు తీసుకుని ఇంటింటికీ వెళ్లి అదనంగా ఓట్లు ఉంటే వారిని తొలగించాలని, లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు గుర్తిస్తే సంబంధిత ఇంటి యజమానితో దరఖాస్తు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ మంగతాయారు, దుండిగల్ తహసీల్దార్ పద్మప్రియ, జంట సర్కిళ్ల అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, శ్రీనివాసరావు, సూపరిడెంట్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పొలిటికల్ పార్టీలతో సమావేశం కాగా జయరాం (బీఆర్‌ఎస్), తులసి (టీడీపీ), అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 21వ వార్డులో నేటి నుంచి కంటి వెలుగు

**నిజాంపేట్:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి 21వ వార్డులో ఈనెల 16 నుంచి 29 వరకు కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సాయినగర్‌లోని బస్తీ దవాఖానాలో ఈకార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే కంటి వెలుగు శిబిరంలో ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షలకు వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డును తీసుకురావాలని కోరారు.

### నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

**జగద్గిరిగుట్ట:** శ్రీ వైష్ణవి దుర్గా శ్రీచక్ర ఉపదేవతల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాలను జగద్గిరిగుట్టలోని మగ్దూంనగర్‌లో ఈనెల16 నుంచి 10 రోజుల పాటు నిర్వహించనున్నట్లు శ్రీజయగురు నవదుర్గా సేవా సమితి తెలిపారు. ఈ పూజలను ఉడుపి కొక్కే సుబ్రమణ్యమఠాధీశులైన శ్రీవిద్యాప్రసన్నతీర్థ స్వామి నిర్వహిస్తారని పేర్కొన్నారు.

### ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం

**టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి**

**కుత్బుల్లాపూర్:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రంలో భాగంగా సోమవారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రామరాజునగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశాయని ఆరోపించారు. ప్రజా సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, సంపత్‌గౌడ్, రాజు, జేమ్స్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపడుతున్నాం

**జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి**

సాక్షి ఎఫెక్ట్..

**రంగారెడ్డినగర్:** ప్రధాన తాగు నీటి పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీపై ఎట్టకేలకు జలమండలి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. షాపూర్‌నగర్ ప్రధాన రహదారిలోని సాగర్ హోటల్ ఎదురుగా ఉన్న నాలా మీదుగా వెళ్తున్న 600 ఎంఎం గోదావరి జలాల పైపులైన్‌కు నెల రోజులుగా లీకేజీ ఏర్పడి నీరంతా నాలాలో వృథాగా పోతోంది. ఈ విషయమై సోమవారం సాక్షిలో »వృథాగా నీరు.. అయినా పట్టించుకోరు..« అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సోమవారం ఉదయమే జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి, డీజీఎం రాజేష్, మేనేజర్ రాజు లీకేజీ ఏర్పడిన ప్రాంతానికి సిబ్బందితో చేరుకుని నీటి సరఫరాను నిలిపివేసి ఆపై పైపులైన్‌కు వెల్డింగ్ పనులను దగ్గరుండి చేయించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపడుతూ వస్తున్నామని అన్నారు. ప్రధాన పైపులైన్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.



షాపూర్‌నగర్ నాలా మీదుగా వెళ్తున్న పైపులైన్ మరమ్మతులను పర్యవేక్షిస్తున్న జీఎం శ్రీధర్‌రెడ్డి

## అసలైన లబ్ధిదారుల స్థలాలనే క్రమబద్ధీకరించాలి

**నిజాంపేట్:** ప్రభుత్వ ఖాళీ స్థలాలపై జీఓ.58, 59 ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలోని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసుకునేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అసలైన లబ్ధిదారుల స్థలాలనే క్రమబద్ధీకరించాలన్నారు. నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో కూన శ్రీశైలంగౌడ్ నిజాంపేట్‌లో సోమవారం పర్యటించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా పేదలకు ఇళ్లు ఇవ్వలేని ప్రభుత్వం.. కబ్జాలు జరుగుతుంటే మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. నిజాంపేట్ మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాలను ప్రజావసరాలకు ఉపయోగించాలని కోరారు. సుమారు 1000 వరకు ఈ జీవో ద్వారా దరఖాస్తు చేసినట్లు తెలుస్తోందన్నారు. అర్హులందరికీ క్రమబద్ధీకరణ ద్వారా మేలు చేయాలని కోరారు. అదే రకంగా అనర్హులు ఖాళీ స్థలాలపై దరఖాస్తు చేసుకుంటే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో–కన్వీనర్ డాక్టర్ రాజు, ప్రధాన కార్యదర్శి భిక్షపతియాదవ్, రంపకాశి, కొంకి రాము, భూపాల్‌రెడ్డి, మాధవరావు, ఈశ్వర్‌రెడ్డి, రాజు, మురళీకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




నిజాంపేట్‌లో పర్యటించి ప్రభుత్వ ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

## సెలవు దినాల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు

**కూల్చివేతలు చేపడుతున్నా పట్టించుకోని కబ్జాదారులు**

**సుభాష్‌నగర్:** గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లోని ప్రభుత్వ స్థలాల కబ్జాల విషయమై నాలుగు రోజుల నుంచి వాడివేడిగా చర్చ నడుస్తుంటే మరోవైపు కబ్జాదారులు తమ పని తాము చేసుకుంటున్నారు. శని, ఆదివారాలు రెండు రోజుల వరుసగా సెలవు దినాలు కావడంతో సర్వే నం.329, 342, 307లలో నిర్మాణాలు చేపట్టారు. కబ్జాల విషయమై ఇప్పటికే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్ కాగా, మరికొందరి అధికారులపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో కబ్జాదారులు మాత్రం తగ్గేదేలే అన్న చందంగా నిర్మాణాలు చేపట్టడం గమనార్హం.



సర్వే నం.307లో కూల్చివేతలు చేపట్టిన దృశ్యం

**మరిన్ని కూల్చివేతలు ఉంటాయి..**

దేవేందర్ నగర్ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాల కూల్చివేతలను తహసీల్దార్ సంజీవరావు నేతృత్వంలో సోమవారం చేపట్టారు. సర్వే నం.307లో 4 గదులు, 342లో ఒక గది, 329లో 2గదులు, బేస్మెట్లను నేలమట్టం చేశారు. మంగళవారం మరిన్ని కూల్చివేతలు ఉంటాయని అధికారులు తెలిపారు.

## కలసికట్టుగా బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలి


**జగద్గిరిగుట్ట:** బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్లాన్ ఇంటర్నేషనల్, జాగృతి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ, బాలల హక్కులపై అవగాహన కల్పించడం హర్షణీయమని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. సోమవారం మగ్దూంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ అవగాహన కార్యక్రమాలతో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, బాలలతో భిక్షాటన, శారీరక మానసిక వేధింపులు, బాలల పట్ల వివక్ష, లైంగాక వేధింపులు చాలా వరకు అరికట్టవచ్చన్నారు. అందరం కలసికట్టుగా బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు మేరీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**ఆధార్‌కార్డ్ క్యాంప్ ప్రారంభం..**

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్‌కార్డ్ క్యాంప్‌ను కార్పొరేటర్ జగన్ ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ క్యాంపును అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్‌కార్డ్ అధికారి రామకృష్ణ,అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యమ్మ, సామాజిక కార్యకర్త యాకన్న, బీఆర్‌ఎస్ ఆర్‌జీకే అధ్యక్షుడు సంతోష్ కుమార్, భూపతిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, జరీనా, అరుణ, తులసి, ఈశ్వరమ్మ, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు

**దుండిగల్:** క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తోందని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సీఎం కప్ పేరుతో క్రీడా పోటీలను ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పోటీలను ప్రారంభించారు. 15 నుంచి 36 సంవత్సరాల వయస్సు గల వారు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పురుషులు, మహిళల విభాగాల్లో తలపడనున్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని కమిషనర్ తెలిపారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

## రూ.6500 కాజేశాడని స్నేహితుడినే చంపేశాడు

**హత్య మిస్టరీని చేధించిన పేట్‌బషీరాబాద్ పోలీసులు**

**కుత్బుల్లాపూర్:** మద్యం మత్తులో మృతి చెందిన ఓ వ్యక్తి హత్య కేసు మిస్టరీని పేట్‌బషీరాబాద్ పోలీసుల చేధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయోధ్యనగర్‌కు చెందిన సాయికిరణ్ (23), సుభాష్‌నగర్‌కు చెందిన గణేష్ (34) కొంత కాలంగా ఎక్కడ పని దొరికితే అక్కడ పని చేసుకుంటూ వచ్చిన డబ్బులతో తాగి జల్సాలకు అలవాటు పడ్డారు. ఈనెల 9వ తేదీన మద్యం సేవించిన ఇద్దరు సుభాష్‌నగర్‌లో నిద్రించారు.

◆ ఈ క్రమంలో నిద్రిస్తున్న సమయంలో గణేష్ జేబులో నుంచి సాయికిరణ్ రూ.6500 కాజేశారు. దీనిని మనసులో పెట్టుకున్న గణేష్ కక్ష పెంచుకున్నారు. ఈనెల 11వ తేదీన సుభాష్‌నగర్‌లోని సర్వే నం.13లోని ఇసుక కుప్పలపై తాగి నిద్రిస్తున్న సాయికిరణ్‌ను తీవ్రంగా గాయపరిచి హత్య చేసి ఆపై ఏమీ తెలియనట్లు అక్కడ నుంచి జారుకున్నాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొంత కాలంగా గణేష్, సాయికిరణ్‌లు కలిసి పని చేస్తున్నట్లు తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా హత్య జరిగిన రోజు ఇద్దరు కలిసి ఉన్నట్లు గుర్తించారు. దీంతో గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయట పడింది. నిందితుడు గణేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

- ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, వివేకానంద్
- వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష




అధికారులతో సమీక్షలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

**నిజాంపేట్:** ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ – శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని రోడ్లు, ప్రగతినగర్ అంబీర్ చెరువు అభివృద్ధి పనులపై సోమవారం శేరిలింగంపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అరికపూడి గాంధీ, వివేకానంద్‌లు వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

**జూన్ 1వ తేదీ వరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి..**

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ సమస్యలు అధిగమించేందుకు నూతనంగా చేపట్టనున్న ఫ్లైఓవర్, రోడ్ల అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రగతినగర్ నుంచి జేఎన్‌టీయూ వెళ్లే రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందన్నారు. దీనికి శాశ్వత పరిష్కార మార్గంగా ఫ్లైఓవర్ నిర్మాణానికి జూన్ 1వ తేదీ వరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పురపాలక మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకునేలా కృషి చేస్తామన్నారు.

**చెరువులో మురుగు చేరకుండా చూడాలి..**

సర్వే నం.172 మియాపూర్ లింక్ రోడ్డు నుంచి నిజాంపేట్ కమాన్ వరకు రోడ్డు, నిజాంపేట్ ప్రధాన రోడ్డు విస్తరణ పనులు, నిజాంపేట్ మోర్ నుంచి ప్రగతినగర్ రోడ్డు అభివృద్ధి పనులకు అవసరమయ్యే ప్రతిపాదనలు సిద్ధం చేసి తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా అంబీర్ చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. చెరువులో గుర్రపుడెక్క తొలగించి మురుగు చేరకుండా చూడాలన్నారు. రూ.1.21 కోట్లతో చేపడుతున్న నాలా పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

◆ ఈ సమావేశంలో నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి, కమిషనర్ రామకృష్ణరావు, ఎస్‌ఆర్‌డీపీ ఎస్‌ఈ వెంకట రమణ, హెచ్‌ఆర్‌డీసీఎల్ ఈఈ సర్దార్ సింగ్, కూకట్‌పల్లి జోన్ టౌన్ ప్లానింగ్ సీపీ ఉమాదేవి, డీసీపీ రఘునందన్, ఏసీపీ రాణి, జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్ ఎస్‌ఈ చెన్నారెడ్డి, గాజులరామారం ఈఈ గోవర్ధన్, ఇరిగేషన్ ఎస్‌ఈ ఆనంద్, ఈఈ నారాయణ, డీఈఈ నళిని, హెచ్‌ఎండీఏ ఎస్‌ఈ హుస్సేన్, ఈఈ హరికృష్ణ, ఈఈ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

**నిజాంపేట్ 13వ డివిజన్‌లో వివేకానంద్ పర్యటన**

◆ ప్రగతియాత్రలో భాగంగా ఎమ్మెల్యే వివేకానంద్ సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి 13వ డివిజన్‌లోని శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, తిరుమల నగర్, నారాయణరెడ్డి కాలనీ, ఇందిరమ్మ కాలనీ ఫేజ్–1లలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, జగన్ యాదవ్ తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029